క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఎదులాపురం: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల తెలుసుకుని, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ సమస్యలను బల్దియా సమావేశంలో లేవనెత్తి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్ షానవాజ్, మహమ్మద్ రోహిద్, బబ్లూ, సిరాజ్ ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

బోథ్: మండల కేంద్రంలో దుర్గామాత భవన నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బుధవారం భూమిపూజ నిర్వహించారు. పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. మహారాష్ట్రలోని దయాల్ ధన్నూర్ గ్రామంలో కైలాస్ టికిడి మహారాజ్ కూతురు వివాహానానికి హాజరయ్యారు. అనంతరం జగిత్యాల డీఎస్పీ ప్రకాష్ మాతృమూర్తి పెద్దకర్మకు హాజరయ్యారు. మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచ్ సురేందర్, బ్రహ్మానంద్, తాహెర్ బిన్ సలాం, వైస్ ఎంపీపీ లింబాజీ ఉన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎదులాపురం: పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ ఒక ప్రకటనలో కోరారు. పెరుగుతున్న ధరలతో అనేక రంగాల కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా ఈ విషయంలో సీఎం కేసీఆర్ చొరవ చూపాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని నేతాజీ చౌక్‌లో భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దప్పిక తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, రాము, కొండ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

తాంసి: భీంపూర్ మండలంలోని బెల్సరీరాంపూర్ గ్రామంలో బుధవారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, గ్రామస్తులు కేశవ్, సంతోశ్, భారత్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలి



పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని తన్వతండా (చిన్నరాజుర) గ్రామంలో జగదాంబ దేవి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు పూజ కార్యక్రమాలను అలవర్చుకోవాలన్నారు. అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

ఉట్నూర్‌రూరల్: కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి బుధవారం మండలంలోని లింగోజితండా లాల్‌టేకిడి జీఎంఆర్ పాలిటెక్నిక్ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. రెగ్యులర్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు మురళి, శ్రీనివాస్, గజానంద్, రాధ, సమంత, రాజ్‌కిరణ్, రఘోత్తంరెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

తాగునీటి తిప్పలు



బావి నుంచి నీటిని తోడుతున్న ఆదివాసీలు

- అడుగంటిన భూగర్భజలాలు
- నెల రోజులుగా సరఫరా కాని భగీరథ నీరు
- ఇబ్బంది పడుతున్న చిలటిగూడ గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



బిందెలతో నీటిని తీసుకొస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని మారుమూల గ్రామాల గిరిజనులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఎండలు దంచికొట్టడంతో భూగర్భజలాలు అడుగంటాయి. అలాగే భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కిలోమీటర్లు నడిచి వ్యవసాయబావుల నీటిని తెచ్చుకోంటున్నారు. ఈనీటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. నీటి వసతి కల్పించాలని అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా.. కనీసం పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల రోజులుగా భగీరథ నీరు బంద్..

మండలంలోని దోడంద గ్రామ పంచాయతీ పరిధిలోని చిలటిగూడ గ్రామంలో 25 ఆదివాసీ కుటుంబాలు, 250పైగా జనాభా నివాసం ఉంటున్నారు. భూగర్భజలాలు అడుగంటడడంతో చేతికి పంపు నుంచి నీరు రావడం లేదు. నెల రోజులుగా భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో చేసేది లేక వ్యవసాయబావి పుడిక తీసి ఆనీటినే తెచ్చుకుంటున్నారు. కాలుషిత నీటితో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతిరోజు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భగీరథ నీరు రావడం లేదు



గ్రామంలోని చేతి పంపులో నీరు రాక మూతపడింది. నెల రోజులుగా భగీరథ నీరు రావడం లేదు. వ్యవసాయబావి పూడిక తీసి, అక్కడి నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేయాలి.

– ఉర్వేత మానిక్‌రావ్, చిలటిగూడ

అధికారులు దృష్టిసారించాలి

నెల రోజులుగా భగీరథ నీరు రావడం లేదు. దీంతో తాగునీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు దృష్టి సారించి మా గ్రామానికి ప్రతిరోజు భగీరథ నీరు సరఫరా చేసి, నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి.

పూసం బొజ్జిబాయి, చిలటిగూడ



అడుగంటిన భూగర్భజలాలు

అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: తల్లిదండ్రులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో గ్రూప్- 2 మూడు నెలల ఉచిత శిక్షణ పూర్తయిన సందర్భంగా అభ్యర్థులకు బుధవారం స్టడీ సర్కిల్ సెంటర్‌లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించడం జరిగిందన్నారు. పోటీ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. దేశ ప్రగతి కోసం పాటుపడిన మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు



కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు

- అధికారుల పర్యవేక్షణ లోపం
- భారీ వర్షాలు కురిస్తే రాకపోకలు బంద్

ఆదిలాబాద్‌రూరల్: లోలెవల్ వంతెన కారణంగా వర్షకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో ప్రభుత్వం మూడు నెలల కిందట మండలంలోని బంగారుగూడ సమీపంలోని వాగుపై వంతెన నిర్మించింది. అయితే రోడ్డుకు రిబిట్‌మెంట్ చేయకపోవడంతో చిన్న వర్షానికే అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోతోంది. చిన్న వర్షానికే ఇలా అయితే.. భారీ వర్షం కురిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. భారీ వర్షాలకు అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టర్ పనులు చేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు కొట్టుకోపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'బీఆర్ఎస్‌పై కుట్రలు చేస్తున్న బీజేపీ'



మాట్లాడుతున్న రావుత్ మనోహర్

బేల: బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌పై కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, తనయుడు పాయల్ శరత్, రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డిలు కుట్రలు, కుతంత్రాలతో కోగ్దూర్ గ్రామంలో పలువురిని రెచ్చగొట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ కూడా ఆటంకాలు సృష్టించారని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తాక్రె గంభీర్, జక్కుల మధుకర్, సతీష్‌పవార్, ఇంద్రశేఖర్, ప్రమోద్ రెడ్డి, తన్వీర్‌ఖాన్ పాల్గొన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. మండలంలోని ఘన్పూర్, గోండు గూడ గ్రామాల్లో కంటివెలుగు ప్రారంభించారు. గ్రామస్తులకు వైద్యాధికారులు కంటి పరీక్షలు చేశారు. అనంతరం కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న దుర్గారాణి

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ దుర్గారాణి అన్నారు. బుధవారం మండలంలోని పెర్కగూడలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం, మోటార్ వెహికల్ చట్టం, వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు జగన్, గిరి, జైవంత్‌రావు, రాజు, సర్పంచ్ హరినాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

తాంసి: బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ సృజన్ పాటిల్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బీఎస్పీ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగే సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగులు, బహుజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ప్రశాంత్, అఖిల్, నరేశ్, అభిలాష్ పాల్గొన్నారు.

కేటీఆర్‌తో ఢిల్లీ వెళ్లిన జెడ్పీటీసీ



ప్రత్యేక విమానంలో కేటీఆర్‌తో అనిల్ జాదవ్

నేరడిగొండ: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో కలిసి నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో మంత్రితో కలిసి అక్కడికి చేరుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పార్టీ కార్యాలయ భవన ప్రారంభోత్సవం ఉండడంతో ఇక్కడి నుంచి వెళ్లారు. మంత్రి కేటీఆర్ మంగళవారం అనిల్ జాదవ్‌కు ఫోన్ చేసి ఆహ్వానించడంతో ఆయనతో కలిసి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లడం జరిగిందని అనిల్ జాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వెళ్లకపోగా, అనిల్ జాదవ్ మంత్రి కేటీఆర్‌తో కలిసి వెళ్లడం బోథ్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

బాధ్యతగా పని చేస్తేనే గుర్తింపు



ఉద్యోగులను సన్మానిస్తున్న పోలీసులు

ఎదులాపురం: పోలీసులు బాధ్యతగా పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని టూ టౌన్ సీఐ పురుషోత్తం అన్నారు. బుధవారం స్టేషన్ నుంచి నలుగురు సిబ్బంది బదిలీపై వెళ్తుండగా వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. శాలువతో సన్మానించి, మిఠాయిలు తినిపించారు. సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ.. అన్నిరకాలుగా సహకారం అందించారని తెలిపారు. అంకిత భావంతో, బాధ్యతయుతంగా విధులను చేపట్టాలన్నారు. ఎస్సై విష్ణు ప్రకాష్, ఉశన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..



బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డులో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికి పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తాత్కాలిక ఏర్పాటు చేసిన రోడ్డు బురదమయంగా మారడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: నర్సయ్య, ఈఈ ఆర్‌అండ్‌బీ, ఫోన్: 94928 10052

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

నేరడిగొండ: నేరడిగొండ మండల గ్రామ పంచాయతీల కారోబారి, మల్టీ వర్కర్స్ కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేరడిగొండకు చెందిన రాచకొండ పోశెట్టి, ఉపాధ్యక్షుడిగా వాంకిడి గ్రామానికి చెందిన కుంచం భోజన్న, కార్యదర్శిగా వడూర్ గ్రామానికి చెందిన రామంచ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కొర్టికల్(బి) గ్రామానికి చెందిన బర్దావల్ హరిప్రసాద్, కోశాధికారిగా కుమారి గ్రామానికి చెందిన నాందెడపు రాజు, సలహాదారుడిగా బోరిగాంకు చెందిన జాదవ్ బలరాం, ప్రధాన కార్యదర్శిగా లింగట్ల గ్రామానికి చెందిన మేర్‌బాన్, చిన్నబుగ్గాంకు చెందిన గజ్జల అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ భద్రత, పొదుపుపై అవగాహన



కిట్లు అందజేస్తున్న డీఈ సుభాష్

ఉట్నూర్‌రూరల్: విద్యుత్ పొదుపు, భద్రతపై బుధవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ డీఈ సుభాశ్ మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది మరమ్మతుల సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అదే విధంగా విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌ను పొదుపు చేయాలన్నారు. ఖాళీ సమయాల్లో లైట్లు, ఫ్యాన్లు విద్యుత్ పరికరాలు ఆఫ్ చేయాలని సూచించారు. అంతకు ముందు సిబ్బందికి భద్రత కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు ఎక్కవద్దు

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా విద్యుత్ తీగలు, స్తంభాలు ఎక్కవద్దని మండల విద్యుత్‌శాఖ అధికారి తిరుపతి రెడ్డి అన్నారు. విద్యుత్ వారోత్సవాలను బుధవారం మండలంలోని అనుకుంట గ్రామంలో ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యుత్ వినియోగదారులకు పలు సూచనలు చేశారు. తెగిపడిన విద్యుత్ తీగలను, వర్షాలతో తెగిపడిన విద్యుత్ స్తంభాలను ముట్టవద్దన్నారు. వ్యవసాయ పంపు సెట్లను వినియోగించిన్నప్పుడు కరెంట్ మోటార్‌ల ఫుట్ వాలులు, సర్వీస్ వైర్‌కు ఇన్సులేషన్ సరిగా లేకపోవడంతో విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ సాయిక్రిష్ణ, ఎస్ఎల్ఐ రవీందర్, లైన్‌మెన్ చంద్రశేఖర్, వినియోగదారులు పాల్గొన్నారు.

విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎదులాపురం(జైనథ్): జైనథ్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయ ఆవరణలో కోనేరు నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస రెడ్డి రూ. లక్ష విరాళం అందజేశారు. బుధవారం కోనేరు భూమిపూజకు హాజరయ్యారు. కిష్టారెడ్డి, కిష్టన్న, సంతోశ్‌రెడ్డి, పిడుగు స్వామి, నాగర్‌కర్ శంకర్, వెంకటేశ్, విట్టల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో భారీ వర్షం



ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు సమాకా, తుమ్మగూడ, గోపాల్సింగ్‌తండా, గిన్నెరా, బిక్కుతండా గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలువురి ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. సమాకా సమీపంలో పాటగూడ రోడ్డుపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టారు. జొన్న, మొక్కజొన్న పంటలు తడిసి, నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పంటలను పరిశీలించి పరిహారం అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



